క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు: మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అధికారులు గత మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల నివేదికలతో పాటు, చేపట్టనున్న ప్రణాళికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

పాణ్యం పంచాయతీకి అవార్డు



మంత్రి ఫరూక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సర్పంచ్ మేకల పల్లవి

పాణ్యం: నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పాణ్యం గ్రామ పంచాయతీకి అవార్డు వరించింది. ఈ అవార్డును మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా చేతుల మీదుగా సర్పంచ్ మేకల పల్లవి అందుకున్నారు. పంచాయితీ సిబ్బందికి అధికారులకు అభినందులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం డొంగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయని హైవే పెట్రోల్ పోలీసులు బుధవారం తెలిపారు. మేకల లక్ష్మన్న అనే వ్యక్తి బైక్‌పై నంద్యాల వైపు వెళ్తుండగా వెనుక వస్తున్న బొలెరో ఢీకొన్నట్లు తెలిపారు. ఈఘటనలో మేకల లక్ష్మన్నకు గాయాలైనట్లు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

సి.బెళగల్: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు కృషి చేయాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. బుధవారం మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో సర్పంచ్ రామాంజనేయులు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు గ్రామ సభను నిర్వహించారు. గ్రామ పరిశుభ్రత, అభివృద్ధి కార్యాక్రమాల నిర్వహణపై తీర్మాణాలు చేశారు. అనంతరం ప్రజలతో పరిశుభ్రత కార్యక్రమాలపై ఈఓఆర్డీ ప్రతిజ్ఞ చేయించారు. వీఆర్వో పాండురంగయ్య, సచివాలయ ఉద్యోగులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్మీ యూనిట్ ప్రారంభం



వర్మీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని గగ్గటూరు గ్రామంలో సర్పంచ్ సద్దల పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. నూతనంగా నిర్మించి వర్మీ యూనిట్ షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. అనంతరం ప్రతి ఇంటికి చెత్త సేకరణకు తడి, పొడి చెత్త సేకరించే డబ్బాలను అందించారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, సద్దల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండె పోటుతో యువకుడు మృతి



హరిశ్చంద్రుడు

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల గ్రామానికి చెందిన మాల లక్ష్మిదేవి, పెద్దశీలమయ్య దంపతుల కుమారుడు హరిశ్చంద్రుడు(25) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. సమీపంలోని ఎయిర్ పోర్టులో ఆరేళ్ల నుంచి సపోర్టెడ్ ఉద్యోగిగా పనిచేస్తున్న హరిశ్చంద్రకు మంగళవారం రాత్రి ఛాతిలో నొప్పిరావడంతో ఉదయం కర్నూలు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని అనుకున్నాడు. ఉదయం మళ్లీ ఛాతినొప్పి రావడంతో హరిశ్చంద్రుడిని సొంత బావ బైక్‌పై తీసుకెళ్తుండగా కుప్పకూలి పడిపోయాడు. 108 అంబులెన్స్‌లో కర్నూలుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు చూపరులను కంటతడిపెట్టించింది.

ప్రజా కళాకారుడు వాసు

కర్నూలు(సెంట్రల్): ప్రజా కళాకారుడు వాసు జీవితం ఆదర్శమని పీఎస్ఎం గ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి పి.నిర్మల పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య భవన్‌లో వాసు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమీలియో హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆయన రచించిన పాటలను కళాకారులు ఆలపించారు. కార్యక్రమంలో కె.అరుణ, సుజాత, లోకేష్, బతుకన్న తదితరులు పాల్గొన్నారు.

జాతిపిత ఆశయాలు సాధిద్దాం

ఓర్వకల్లు: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను సాధిద్దామని ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు పిలుపునిచ్చారు. మండలంలో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలనాధికారి వెంకటరమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు గాంధీ త్యాగాలను గుర్తు చేశారు. అలాగే స్థానిక సచివాలయంలో ఈఓఆర్డీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జాతిపిత చిత్రపటానికి టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరించారు. అలాగే నన్నూరు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిని కౌసల్య ఆధ్వర్యంలో గాంధీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంధి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి అధికారులు పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. గాంధీ త్యాగాలను ఈఓఆర్డీ సందీప్ గుర్తు చేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి వీఆర్వోలు శేఖర్, వెంకటేశ్వర్లు, పాండురంగయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈర్లదిన్నె, కొత్తకోటలో సర్పంచ్‌లు పెద్దక్క, శ్రీనివాసులు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి తారకేశ్వరీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాదుపు కార్యాలయంలో ఏపీఓ హజరత్, విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏఈ ఖలీల్ పాషా ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. అదేవిధంగా గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, దుర్వేశి సర్పంచ్ మండ్ల మమత ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.

కోడుమూరు రూరల్ : జాతిపిత మహాత్మగాంధీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయలో గాంధీ చిత్రపటానికి మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డితో కలిసి జెడ్పీటీసీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతిపిత త్యాగాలను ఈ సందర్భంగా జెడ్పీటీసీ గుర్తు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో...

గాంధీజీ జయంతిని పురస్కరించుకుని కోడుమూరులోని మహాత్ముడి విగ్రహానికి చేనేత కార్మిక సంఘం, సీపీఎం, సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు,జిల్లా అధ్యక్షులు లక్ష్మన్న, సీపీఎం మండల కార్యదర్శి గఫూర్‌మియ్యా, సిఐటీయూ మండల కార్యదర్శి వీరన్న, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గూడూరులో...

గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం గూడూరులో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్‌ల ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పాణ్యం: గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించేందుకు అందరూ కృషి చేయాలని ఎంపీపీ ఉసేన్‌బీ పిలుపునిచ్చారు. గాంధీ విగ్రహానికి పూలమావేల వేసి నివాళులర్పించారు. పాణ్యం పంచాయతీ కార్యాలయ ఆవరణలోని వర్మీ యూనిట్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీడీఓ దస్తగిరి, సర్పంచ్ మేకల పల్లవి మాట్లాడారు. గాంధీ త్యాగాలను వారు గుర్తు చేశారు.పంచాయతీ పారిశుద్ధ్యయ కార్మికులకు సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ ఆనందరావు, పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కర్నూలు (రూరల్) : మండలంలో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనురాధ ఆధ్వర్యంలో పసుపల గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. అదేవిధంగా పంచలింగాల గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు హాజరయ్యారు. గార్గేయపురం గ్రామ సర్పంచ్ సోమేశ్వరమ్మ, ఎంపీటీసీ జ్యోతిలత గ్రామ సభ నిర్వహించారు.



నన్నూరు: గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



కోడుమూరు : గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి



పసుపల: గ్రామ సభలో పాల్గొన్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి



పంచలింగాల: ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు



ఓర్వకల్లు : గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



సి. బెళగల్ : మహాత్ముడికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ పెద్దక్క, అధికారులు



సి. బెళగల్ : గాంధీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ శ్రీనివాసులు, అధికారులు



గూడూరు: గాంధీకి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు



అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎంపీపీ, ఉసేన్‌బీ , అధికారులు, ప్రజాప్రతినిధులు

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు



కోడుమూరులో వెలసిన శ్రీవల్లెలాంబదేవి

కోడుమూరు రూరల్ : దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం నుంచి మండలంలోని కోడుమూరు, గోరంట్ల గ్రామాల్లో వెలసిన అమ్మవార్ల ఆలయాల్లో శరన్నవరాత్రుల మహోత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కోడుమూరులో వెలసిన వల్లెలాంబదేవి, కాళికాదేవి, చౌడేశ్వరీ, కన్యకాపరమేశ్వరీ, గంగా మాత, లచ్చమ్మ, తులజా భవాని, రాములమ్మ, అంబా భవానీ ఆలయాలతో పాటు, గోరంట్లలో వెలసిన లక్ష్మీమాధవస్వామి ఆలయాలు ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఈనెల 3నుంచి 12వతేదీ వరకు తొమ్మిదిరోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో గురువారం నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు. మండల కేంద్రం సి.బెళగల్లోని ఈశ్వరాలయంలో పంచలోహ అమ్మవారిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు అమ్మవారి ప్రత్యేక అలంకరణలతో పూజలను నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు.

పాణ్యం: దేవీ నవరాత్రుల ఉత్సవాలను జయ ప్రదం చేయాలని దేవాదాయశాఖ ఈఓ సువర్ణ బుధవారం తెలిపారు. ఈనెల 03నుంచి 11వ తేది వరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 03వ తేదీన అమ్మవారు గౌరి దేవిగా దర్శనమిస్తారన్నారు. అదేవిధంగా 04న పార్వతిదేవిగా, 05న రాజరాజేశ్వరిగా, 06న అన్నపూర్ణదేవిగా, 07లలితాదేవిగా, 08న కాత్యాయినీదేవిగా, 09న సరస్వతీ దేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. 12వ తేదీన గ్రామోత్సవం ఉంటుందన్నారు.



లొద్దిపల్లెలో మెయిన్ రోడ్డు పక్కన కొలుదీరనున్న అమ్మవారు



లొద్దిపల్లె గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద కొలువుంచనున్న అమ్మవారు

ఓర్వకల్లు: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా గ్రామాలలో అమ్మవార్లు గురువారం కొలువుదీరనున్నాయి. దసరా సందర్భంగా ప్రతిష్ఠించేందకు అమ్మవార్ల విగ్రహాలను కొనుగోలు చేసి ట్రాక్టర్లపై తీసుకొచ్చారు. లొద్దిపల్లె-2, నన్నూరు-2, హుసేనాపురం-2, భైరాపురం, శకునాల, బ్రాహ్మణపల్లె గ్రామాలలో ఒకటేసి చొప్పున మొత్తం తొమ్మిది విగ్రహాలను కొలువుంచనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నూతన మద్యం పాలసీకి వ్యతిరేకంగా మహిళల నిరసన



కోడుమూరులో మహాత్ముడి విగ్రహానికి వినతి పత్రమిస్తున్న ఏపీ మహిళా సమాఖ్య సభ్యురాళ్లు

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ బుధవారం కోడుమూరులో ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపారు. మహాత్ముడి విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు విజయభారతి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మహిళా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలను భారీగా పెంచి మహిళల మంగళ సూత్రాలు తెంపాలని చూస్తున్నారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం రూ.99లకే మద్యం విక్రయిస్తామని చెప్పి, నాణ్యతపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీపై చూపిస్తున్న శ్రద్ధ గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి చూపడం లేదన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాళ్లు సులోచన, సువర్ణ, దేవమ్మ, పార్వతమ్మ, నాగమ్మ, నజ్మా, సత్యమ్మ, సుమలత, సురేఖ, సరోజ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచాలకట్ట వద్ద వాతావరణ సూచిక ఏర్పాటు

గడివేముల: మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో ఆటోమెటిక్ వాతావరణ స్టేషన్‌ను ఐటీసీ (ఇండియన్ టోబ్యాకో కంపెనీ) ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఐటీసీ మార్స్ కార్యక్రమంలో భాగంగా వాతావరణ పరికరం ద్వారా వర్షపాతం, ఉష్ణోగ్రత, పవన వేగాన్ని రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు ఉపయోగపడుతుందని కంపెనీ ఫీల్డ్ అధికారి జావీద్ బాషా తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

కర్నూలు (టౌన్): మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహద పడతాయని నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి స్కేటింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన కమిషనర్ మాట్లాడుతూ.. వి ద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్, కోశాధికారి అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి




మహాత్ముడి విగ్రహం ముందు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినదిస్తున్న చేనేత సంఘం నాయకులు

కోడుమూరు రూరల్ : రెక్కాడితే గాని డొక్కాడని చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి కోరారు. బుధవారం గాంధీ జయంతి పురస్కరించుకుని చేనేత సంఘం నాయకులు కోడుమూరులో మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత రంగ సమస్యలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ మహాత్ముడి విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో చేనేత సంఘం స్థానిక నాయకులు మహబూబ్‌బాషా, నరసింహులు, నాగరాజు, శ్రీరాములు, విజయ్, మధు, కోనప్ప, నరసప్ప, లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పీఆర్‌సీ ఇచ్చేంత వరకు మధ్యంతర భృతిని ప్రకటించి అమలు చేయాలని డీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా పరిషత్ వద్ద మహాత్మ గాంధీ విగ్రహం ఎదుట ఆ సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె క్రిష్ణ మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యావ్యవస్థను నీర్వర్యం చేస్తున్న జీఓ నంబరు 117ను రద్దు చేయాలని, ఆంగ్ల భాష మాధ్యమంతో పాటు, మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాలను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాముడు, కిశోర్, గట్టు తిమ్మప్ప, ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు, గోట్ల చంద్రశేఖర్, జిల్లా కమిటీ బాధ్యులు వెంకటేశప్ప, ఈశ్వర్ రెడ్డి, రామన్న, రోసన్న, తదితరులు పాల్గొన్నారు.


ఆదాయం కోసం పేదల రక్తాన్ని పీల్చుతారా?



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం కోసం పేదల రక్తాన్ని పీల్చుతారా అని సీఎం చంద్రబాబు నాయుడుపై ఏపీ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్ మండిపడ్డాయి. నూతన మద్యం పాలసీని విరమించుకోకపోతే మహిళలతో కలసి రోడ్లపైకి వస్తామని హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నూతన మద్యం పాలసీని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణి రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. నూతన మద్యం పాలసీలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 2900 షాపులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్‌లు ఇచ్చేలా పూనుకోవడం అన్యాయమన్నారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను అనుమతిస్తే పేదలు తాగి చావరా? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో పెట్టిన ఖర్చును తిరిగి తెచ్చుకునేందుకే మద్యం షాపులను ప్రైవేట్‌కు ఇచ్చారని, ఇది దారుణ చర్య అని మండిపడ్డారు. నూతన మద్యం పాలసీపై మహిళల అభిప్రాయాలు తూతూమంత్రంగా సేకరించారని ఆరోపించారు. వివిధ రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలకు సమయం తక్కువగా ఇస్తుండగా ఇక్కడ మాత్రం రోజులో 13 గంటలకుపైగా అమ్ముకోవడానికి అనుమతులు ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. నూతన మద్యం పాలసీ వస్తే కుటుంబాల మధ్య, కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు, వివాదాలు పెరుగుతాయన్నారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు ఎక్కువయ్యే ప్రమాదం ఉందని వాపోయారు. మద్యాన్ని సేవించిన వారు అనారోగ్యం పాలవుతారని, వీటన్నింటినీ ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోకుండా నూతన మద్యం పాలసీని తేవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాగేంద్రమ్మ, పావని, విజయ, శైలజ, కోటమ్మ, సులోచనమ్మ, ఆదిలక్ష్మీ, మల్లేశ్వరి, సుశీలమ్మ, శారదమ్మ పాల్గొన్నారు.

పైపులైన్ గుంతను పూడ్చండి



పైపులైన్ గుంతను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: ప్రమాదకరంగా మారిన పైపులైన్ గుంతను తక్షణమే పూడ్చివేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులు బుధవారం నిరసన తెలిపారు. పైప్‌లైన్ గుంతను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి గార్గేయపురం, కేతవరం, పూడిచెర్ల మీదుగా వెళ్లే ప్రదాన రహదారి పొడవునా ఓర్వకల్లు వద్ద నిర్మిస్తున్న స్టీల్‌ప్లాంట్‌కు నీటి అవసర నిమిత్తం తవ్విన పైపులైన్ ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ గుంతలో ఇటీవల ఒక ఆవుపడి మృత్యువాతకు గురైందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీధర్, వెంకటేశ్వర్లు, రంగస్వామి, బుగ్గరాముడు, మద్దిలేటి, మధుసూదన్, బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com